# దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించాలి





సత్తుపల్లి రూరల్ : కల్లంలో తడిచిన ధాన్యాన్ని ఆరబెడుతున్న కర్షకులు, వైరాటౌన్ : దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న నాయకులు

- రైతు కంట కన్నీరు మిగిల్చిన తుపాన్
- యుద్ధప్రాతిపదికన నష్టం నమోదు చేయాలి

సత్తుపల్లి రూరల్, డిసెంబర్ 7 : మండలంలోని గంగారం, పాకలగూడెం, బేతుపల్లి, రామానగరం, కాకర్లపల్లి గ్రామాల్లో వరదకారణంగా కల్లాలు, యార్డుల్లో ఆరబోసిన ధాన్యం నిల్వలు తడిచి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. గురువారం వర్షం తెరిపి నివ్వడంతో తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. చేతికి వచ్చిన వరిపంట నీటిపాలైందని, తీరని నష్టం జరిగిందని అన్నదాతలు వాపోయారు.

పెనుబల్లి, డిసెంబర్7 : తుఫాన్ రైతుల కంట కన్నీరు మిగిల్చింది. భవన్నపాలెం గ్రామానికి చెందిన నల్లబోతుల చెన్నారావు, చింతల శ్రీను అప్పుచేసి మరీ 12 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వరిపంట వేశారు. తుఫాన్ దాటికి పంట పూర్తిగా నీట మునిగింది. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని వారికి సహాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

కొణిజర్ల, డిసెంబర్ 7 : దెబ్బతిన్న పంటలను యుద్ధ ప్రాతిపదికన సర్వే జరిపి నష్టం నమోదు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. మండలంలోని లాలాపురం, పల్లిపాడు గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను రైతు సంఘం బృందం సభ్యులతో గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వ్యవసాయ శాఖ సర్వే చేసి రైతులకు పరిహారం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





పెనుబల్లి : తడిచిన ధాన్యాన్ని ట్రాక్టర్లలోకి ఎత్తుతున్న రైతులు, వైరాటౌన్ : వరి పంటను పరిశీలిస్తున్న నాయకులు

వైరాటౌన్, డిసెంబర్ 7 : తుఫాన్ వలన దెబ్బతిన్న అరటి తోటలకు ఎకరాకు లక్ష రూపాయలు పరిహారం అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పండ్ల తోటలను తెలంగాణ రైతు సంఘం బృందం గురువారం పరిశీలించింది. కార్యక్రమంలో నాయకులు సుంకర సుధాకర్, పైడిపల్లి సాంబశివరావు, నారికొండ అమరేంద్ర, యనమద్ది రామకృష్ణ, వడ్లమూడి మధు తదితరులు పాల్గొన్నారు. ఈదురు గాలులతో కూడిన భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గురువారం వారు మాట్లాడుతూ రైతాంగం జాగ్రత్తలు పాటించి పంట నష్టాన్ని నివారించుకోవాలని అన్నారు.

## మంత్రి పొంగులేటికి అభినందనలు

కారేపల్లి, డిసెంబర్ 7 : తెలంగాణ రాష్ట్ర మంత్రిగా గురువారం ప్రమాణ స్వీకారం చేసిన పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కారేపల్లి మండల కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఆ పార్టీ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరరావు, షేక్ సైదులు, దుగ్గినేని శ్రీనివాసరావు, సురపరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ఆదెర్ల స్రవంతి, అజ్మీర నరేశ్, ఇమ్మడి రమాదేవి, మండెపూడి సత్యనారాయణ, భాగం నాగేశ్వరరావు, తొగర శ్రీను తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

## మంత్రి తుమ్మలను కలిసిన నాయకులు



మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసిన నాయకులు నల్లమల, చందర్‌రావు

కల్లూరు, డిసెంబర్ 7 : కల్లూరుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు క్రిసెంట్ ఫార్మసీ కంపెనీ జాని మియా, నల్లమల వెంకటేశ్వరరావుతో కలిసి హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా మంత్రిగా ఎన్నికైనందుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా కల్లూరు వస్తానని తుమ్మల చెప్పారని అన్నారు.

## కుంగిన బ్రిడ్జిని పరిశీలించిన అధికారి

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 7: పాత కొత్తగూడెం నుంచి పెనుబల్లి పంచాయతీకి వెళ్లే దారిలో ఉన్న బ్రిడ్జి తుపాన్ కారణంగా కుంగిపోయింది. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి కౌన్సిలర్లతో కలిసి గురువారం ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. తాత్కాలిక మరమ్మతులు చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఫోన్‌లో కోరారు. కౌన్సిలర్లు పరమేశ్ యాదవ్, ధర్మరాజు, బండి నరసింహ, రుక్మాంగదర్ బండారి, ఎంఏ రజాక్, యూసుఫ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

## 'అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు'

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 7: తుపాన్ కారణంగా రెండు రోజులుగా పట్టణంలో కురిసిన భారీ వర్షాలతో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు నిర్వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రఘు సూచించారు. మున్సిపల్ అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో అవాంతరాలు తలెత్తకుండా సమన్వయంతో పనిచేసిన సిబ్బందిని అభినందించారు. ఎన్నికల కోడ్ వల్ల నిలిపివేసిన పనులన్నీ వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈ రవి తదితరులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఏడీఏ



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ కరుణశ్రీ

పాల్వంచ రూరల్; డిసెంబర్ 7: తుపాన్ కారణంగా మండలంలో దెబ్బతిన్న పంటలను ఏడీఏ కరుణశ్రీ, ఇతర వ్యవసాయశాఖ అధికారులు గురువారం పరిశీలించారు. మండలంలోని కోడిపుంజులవాగు, రంగాపురం గ్రామాల్లో నీట మునిగిన, వరదలకు కట్టుకపోయిన వరి, మిర్చి సహా ఇతర పంటలు పరిశీలించి రైతులతో మాట్లాడారు. అలాగే, దంతెలబోర, సంగం, నాగారం, నారాయణరావుపేట తదితర ప్రాంతాల్లోని పొలాలను ఏఈవో విజయభాను సందర్శించి పంటల పరిస్థితి గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. కోడి పుంజలవాగు గ్రామంలో రైతులతో ఏడీఏ కరుణశ్రీ మాట్లాడుతూ.. తడిసిన వరి ధాన్యం మొలకలు రాకుండా ఉండేందుకు ఉప్పు ద్రావణాన్ని చల్లాలని, వర్షపు నీరు బయటికి పోయేలా కాలువలు తీయాలని, నేలవాలిన మిర్చి మొక్కలకు కర్రలు కట్టాలని సూచించారు. సర్పంచ్‌లు సాధు, మాలోతు హరి తదితరులు పాల్గొన్నారు.

## పొలాల్లో ధాన్యం.. ఆందోళనలో రైతాంగం..



వరద నీటిలో ఉన్న వరి పంట

పర్ణశాల, డిసెంబర్ 7: తుపాన్ వల్ల కురిసిన అకాల వర్షాలతో పంటలు వేసిన రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. దుమ్ముగూడెం మండలంలోని రైతులు సుమారు 18 వేల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. ఇప్పటికే సరైన దిగుబడి లేక దిగులుతో ఉన్న రైతులను తుపాన్ మరింత ఆందోళనలోకి నెట్టింది. అలాగే, మండలంలో 21 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా.. సుమారు 8 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. రైతులు వరి కోతలు కోసి పొలాల్లోనే ధాన్యాన్ని ఉంచారు. ఇంతలోనే వర్షం రావడంతో అక్కడి ధాన్యం రాశులన్నీ తడిసిపోయాయి. మరికొన్ని చోట్ల వడ్లు కొట్టుకపోయాయి. కూరగాయలు, మిర్చి రైతులకు సైతం భారీ నష్టం వాటిల్లింది.

## గ్రామాల్లో వైద్యశిబిరాల ఏర్పాటు



గ్రామస్తులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

కారేపల్లి, డిసెంబర్ 7 : బల్లునగర్‌తండా, బీక్యాతండా, వెంకిట్యాతండా, గిద్దెవారిగూడెం గ్రామాల్లో బీక్యాతండా పల్లె దవఖాన ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు.పల్లెదవాఖాన వైద్యాధికారి బి.హిమబిందు గ్రామస్తులకు వైద్య పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ వీధులను పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు ఉండం రాధ, విజయకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోటమైసమ్మ తల్లికి ఆభరణం వితరణ



ఆలయ చైర్మన్‌కు ఆభరణాన్ని అందిస్తున్న దాతలు

కారేపల్లి, డిసెంబర్ 7 : మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి కోటమైసమ్మ అమ్మవారికి మహబూబాబాద్ జిల్లా ముల్కనూర్ గ్రామానికి చెందిన కడియాల భారతి గురువారం రూ. 1.25 లక్షల విలువైన బంగారు కంఠాభరణాన్ని ఆలయ చైర్మన్ పర్సాపట్టాభి రామారావుకు వితరణగా అందించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారి కొండకింది వేణుగోపాలాచార్యులు, అర్చకుడు కొత్తలంక కైలాస శర్మ, సిబ్బంది మూడు మోహన్‌చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి కరాటే పోటీలకు నిఖిత



కరాటే పోటీకి ఎంపికైన నిఖిత

తల్లాడ, డిసెంబర్ 7 : నల్గొండలో ఇండోర్‌స్టేడియంలో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు జరిగిన తెలంగాణ రాష్ట్ర స్కూల్ గ్రేమ్స్ కరాటే పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో బాలభారతి విద్యాలయానికి చెందిన కటిక నిఖిత రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించి జాతీయస్థాయికు ఎంపికైంది. నిఖితను ఎంఈవో దామోదరప్రసాద్, కేఎస్ఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, కరాటే మాస్టర్ బాబురావు, ఉపాధ్యాయులు అభినందించారు.

## టీచర్‌కు ఆర్థిక సాయం

సత్తుపల్లి రూరల్, డిసెంబర్ 7 : క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న విజయలక్ష్మి టాలెంట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆమెకు క్యాన్సర్ ఉందని నిర్ధారణ కావడంతో పాఠశాల కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ కలిసి రూ.76,500 సేకరించి బాధిత టీచర్ విజయలక్ష్మికి గురువారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



టీచర్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న విద్యార్థులు